సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 13 । మార్చి । 2024



అపురూప ఘట్టం.. మహానైవేద్యం

రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో అపురూప ఘట్టమైన మహానైవేద్యాన్ని వేదపండితులు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. - 8లో

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
రాయచోటి	:	6.29	5.08
రాజంపేట	:	6.30	5.06
పీలేరు	:	6.31	5.03
మదనపల్లె	:	6.31	5.10

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 64 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	480	480
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 134.500 కిలోలు

న్యూస్‌రీల్

మిట్స్ ప్రొఫెసర్‌కు జపాన్ యూనివర్సిటీ ఆహ్వానం



జపాన్‌లో శాస్త్రవేత్తతో శ్రీకాంత్ బొంతల

కురబలకోట: మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్ బొంతల జపాన్‌లోని గకుషుయిన్ యూనివర్సిటీ ఆహ్వానంపై సందర్శించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. భారత్, ఇండోనేషియా వంటి ఆసియా దేశాలు సాధించిన విజయాలు, తలసరి స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ), పారిశ్రామికీకరణ, సమయ శ్రేణి, విశ్లేషణ, ఇతర వాటితో పోల్చడం అంశాలపై పరిశోధన నిమిత్తం జరిగిన ఫ్యాకల్టీ రీసెర్చ్ కొలాబరేషన్ సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు.

కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: కోయంబత్తూరు నుంచి రాజస్థాన్‌లోని భగత్ కి కోటి ప్రాంతానికి కడప మీదుగా ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు కడప రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ షేక్ ఉమర్‌బాషా తెలిపారు. ఈ నెల 14వతేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీవరకు రైలును నడపనున్నారని పేర్కొన్నారు. ఈ నెల 14, 21, 28, ఏప్రిల్ 4 తేదీలలో ఈ రైలు కోయంబత్తూరులో (06181) అర్ధరాత్రి 2.30 గంటలకు బయలుదేరి అదే రోజున మధ్యాహ్నం 1.55 గంటలకు కడపకు చేరుతుందన్నారు. గుత్తి, డోన్, కాచిగూడ, నాందేడ్, అహ్మదాబాద్ మీదుగా భగత్‌కి కోటికి చేరుతుందన్నారు. భగత్ కి కోటి(06182) నుంచి ఈ నెల 17, 24, 31, ఏప్రిల్ 7 తేదీలలో సాయంత్రం 7.30 గంటలకు బయలుదేరి మంగళ వారం సాయంత్రం 6.00 గంటలకు కడపకు చేరుతుందన్నారు. మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు కోయంబత్తూరుకు వెళ్తుందన్నారు.

అన్నదానానికి విరాళం

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే నిత్యాన్నదాన పథకానికి అనంతపురం పట్టణం మారుతీనగర్‌కు చెందిన కడవల్లి శేషు, శ్రుతి దంపతులు రూ.1,01,116లు అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు.

అప్రమత్తతతోనే ఆరోగ్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

సంబేపల్లి: వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడమే ఆరోగ్యమని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కొండయ్య అన్నారు. మంగళవారం సంబేపల్లె మండలం, రౌతుకుంట గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేస్–2 కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రజల పాలిట సంజీవని అన్నారు. ఈ పథకం ద్వారా వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు ఇస్తారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు ఏర్పాటయ్యాయన్నారు. వివిధ వ్యాధుల నిర్ధారణకు అధునాత ఎనలైజర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 303 మందికి వైద్య సేవలు అందించారు. వైద్యులు సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ నిర్మల కుమారి, సూపర్ వైజర్లు సదాశివరెడ్డి, లక్ష్మీనారాయణ, రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ సాయిలీల, ఆరోగ్య కార్యకర్త మెహరిన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాతర ముగిసే.. జనం మురిసే!

లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గంగమ్మ జాతర మంగళవారం మైల తిరునాలతో ఘనంగా ముగిసింది. సోమవారం ఉత్సవాలు ప్రారంభం కాగా మొదటిరోజు భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

- రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా గంగమ్మ జాతర
- ఉప్పెనలా తరలివచ్చిన భక్తజనం
- వందలాదిగా చేరుకున్న చాందినీ బండ్లు
- మెరుగైన సౌకర్యాలు కల్పించిన అధికారులు, ఆలయ కమిటీ



భక్తులతో కిక్కిరిసిన గంగమ్మ ఆలయ ప్రాంగణం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అనంతపురం గంగమ్మ దేవత

లక్కిరెడ్డిపల్లె: రాయలసీమలోనే అతి పెద్ద జాతరగా పేరుగాంచిన లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గంగమ్మ దేవత జాతర రెండవ రోజైన మంగళవారం మైల తిరునాలతో ముగిసింది. భక్తులు ఉప్పెనలా తరలి వచ్చారు. దీంతో జాతర ప్రాంగణం జన సంద్రంగా మారింది. తెల్లవారుజామున 2 గంటల సమయంలో అమ్మవారు అశ్వవాహనంపై ఆలయ ప్రాంగణం చుట్టూ బాణసంచా పేలుళ్లు, మంగళ వాయిద్యాలు, కోలాహలం నడుమ భక్తులకు దర్శనమిస్తూ మెరవణిగా ఆలయం చేరుకున్నారు. మార్చి నెల కావడంతో ఎండల తీవ్రత కారణంగా రాత్రి 7 గంటల నుంచి భక్తుల రద్దీ క్రమక్రమంగా పెరిగింది. చివరకు ఇసుకేస్తే రాలనంతగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు రావడంతో క్యూలైన్లు నిండిపోయాయి. రాయలసీమ జిల్లాల నుంచి నాలుగు వందలకు పైబడే చాందినీ, కుంకుమ, ఎద్దుల బండ్లు జాతరకు చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్య పోలీసులకు సవాల్‌గా మారింది. అన్నమయ్య జిల్లా డీఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో సీఐ జీవన్ గంగనాథ్‌బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్‌లు పోలీసు బందోబస్తుతో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, ప్రత్యేకాధికారి రవీంద్రరాజు, సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించారు. ఆలయం చుట్టూ చేరిన చాందినీ బండ్లు భక్తులకు కనువిందు చేసేలా మిరిమిట్లు గొలిపే కాంతులతో ఆకట్టుకున్నాయి. లక్షలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు. రవి చెక్కభజన బృందం ఏర్పాటు చేసిన చెక్క భజన భక్తులను ఎంతగానో అలరింపజేసింది. లక్కిరెడ్డిపల్లె విలేకరులు, గంగమ్మ తల్లి సేవాసమితి, అయ్యప్ప సేవాసమితి, మానవత ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లు , నీళ్ల బాటిళ్లను అందజేశారు. దేవళంపల్లె , కోనంపేట పీహెచ్‌సీ వైద్యులు సిద్దయ్య, సుమలత ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా వైద్య సేవలందించారు. సాయంత్రం చాగలగుట్టపల్లె అమ్మవారు బయలు దేరగానే దారి పొడవునా అమ్మ వారి ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ పుట్టినింటికి చేర్చడంతో జాతర ముగిసినట్లు సంకేతం.



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న చాందినీ బండ్లు



జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కుంకుమ బండి



తిరుగు ప్రయాణంలో చాగలగుట్టపల్లె ఉత్సవ మూర్తి

పేదరికం లేని సమాజమే సీఎం ఆశయం



జ్యోతిప్రజ్వలన చేసి జాబ్‌ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న కొండూరు అజయ్‌రెడ్డి

రాజంపేట టౌన్: రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి తద్వారా పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌ఫెస్ట్ (క్యాంపస్ సెలక్షన్స్)ను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తంతో కలిసి అజయ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో విద్యకు పెద్దపీట వేసి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విద్యతోనే పేదరికం దూరం కాగలదని విశ్వసించడం వల్లే సీఎం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. అలాగే ఉన్నత చదువులు చదువుకున్న వారికి జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు జగన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో యువత, విద్యావంతులు జగన్‌కు అండగా నిలిచి ఆయనను మళ్లీ సీఎం చేయాలని కోరారు. కాగా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో రాజంపేట, రైల్వే కోడూరు, రాయచోటి, కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 270 విద్యార్థులు పాల్గొనగా 225 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి జోసప్ప, సీపీడీసీ సెక్రెటరీ డాక్టర్ నాగా చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎస్‌డీసీ ప్రత్యేక అధికారి హరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయాలు జగన్‌తోనే సాధ్యం



రాజంపేట టౌన్: వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తున్న మేడా, ఆకేపాటి, పోలా

- సంబరాల మధ్య వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు మేడా, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి

రాజంపేట టౌన్ : దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలు జగన్‌తోనే సాధ్యం కాగలవని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జెడ్పీ ఛైర్మన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడా, ఆకేపాటి, పోలా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం ఓ చారిత్రాత్మకమని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజన్న రాజ్యం తీసుకొచ్చేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీని స్థాపించి అధికారంలోకి రావడం వల్లే జగన్ నేడు సంక్షేమ పథకాలతో పేద ప్రజలను ఆదుకుంటూ వారి మోముల్లో చిరునవ్వులు నింపుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు మద్దతుగా నిలిచి మళ్లీ ఆయనను సీఎంను చేసుకుంటేనే పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలే కాక ప్రజలు సైతం స్వచ్ఛందంగా ఓ పండుగ వాతావరణంలో జరుపుతుండటం ప్రజలకు జగన్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్న ధీమాను వారు వ్యక్తం చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ సీపీ జెండాను మేడా, ఆకేపాటి, పోలా ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, పోలా వెంకటరమణారెడ్డి, మర్రి రవి, జెనుగు కృష్ణారావుయాదవ్, వడ్డే రమణ, యోగీశ్వర్‌రెడ్డి, డీలర్ సుబ్బరామిరెడ్డి, రాము యాదవ్, మనుబోలు వెంకటసుబ్బయ్య, సత్యాల రామకృష్ణ, దాసరి పెంచలయ్య, మిర్యాల సురేఖ, జాహీద్ అలీ, వివిధ వార్డుల కౌన్సిలర్లు, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను అధిగమించాలి

బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశం



బ్యాంకర్లతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వార్షిక ప్రణాళికలను అధిగమించి జిల్లా ప్రగతికి విరివిగా రుణాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాలులో కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్‌ఆర్‌పీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో మూడవ త్రైమాసికం డిసెంబర్ 31 నాటికి బ్యాంకులు సాధించిన ప్రగతిపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వరరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 వార్షిక రుణ ప్రణాళికలో డిసెంబర్ 31 మూడవ త్రైమాసికం చివరి నాటికి జిల్లాలో మొత్తంగా రూ. 8636 కోట్లు లక్ష్యం కాగా, రూ. 10869 కోట్ల రుణాలు అందించి 126 శాతం ప్రగతి సాధించామన్నారు. అలాగే వ్యవసాయ రంగంలో రూ. 6422 కోట్లు లక్ష్యం కాగా రూ. 7662 కోట్ల మేర రైతులకు రుణాలు అందించి 119 శాతం, ప్రాధాన్యత రంగంలో రూ.7633 కోట్లు లక్ష్యం కాగా రూ. 8853 కోట్ల రుణాలు అందించి 116 శాతం ప్రగతి సాధించామన్నారు. పీఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో 919 యూనిట్లకు లక్ష్యాన్ని మించి రూ. 15.39 కోట్ల రుణాలు అందించారన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు మూడవ త్రైమాసికం నాటికి 21686 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా యూనిట్లకు రూ. 946 కోట్లు అందించారన్నారు. ఇతర ప్రాధాన్యత రంగాలలో 13090 యూనిట్లకు రూ. 244.67 కోట్లు, డీఆర్‌డీఏ మెప్మా శాఖల ఆధ్వర్యంలో గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని 13069 మహిళా సంఘాలకు రూ. 1191.83 కోట్లు అందించామన్నారు. ఎస్‌బీఐ, యూనియన్, సప్తగిరి బ్యాంక్ ఆర్ఎంలు కేఎస్ఎస్ శర్మ, బి.భాస్కర్, జీవీఎం ప్రసాద్, నాబార్డు ఏజీఎం విజయ్ విహారి పాల్గొన్నారు.

ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలి

ఎన్నికలకు కేటాయించిన సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో స్వీప్ కార్యక్రమాలు, ఎంసీసీ, ఎంసీఎం, ఈవీఎంల నిర్వహణ, ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్ యాప్స్ తదితర అంశాలపై ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, డీటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితర ఎన్నికల సిబ్బందికి సంబంధిత నోడల్ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఏ చిన్న తప్పును ఉపేక్షించమన్నారు. స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి రాజశేఖర్, ఎంసీసీ నోడల్ అధికారి గురుప్రకాష్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి జయరాముడు, ఈవీఎం నోడల్ అధికారి మద్దిలేటి, నామినేషన్ల ప్రక్రియపై రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, భారత ఎన్నికల సంఘం రూపొందించిన మొబైల్ అప్లికేషన్లపై సమాచార సాంకేతికత నోడల్ అధికారి హరికృష్ణ అవగాహన కల్పించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీఓలు గురుస్వామి, హరిప్రసాద్, మోహన్ రావు శిక్షణా కార్యక్రమాల నోడల్ అధికారి ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సాధారణ ఎన్నికల నిర్వహణపై నోడల్‌అధికారులు, ఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏఎస్‌పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఎస్‌ఓ శుభం, డీఆర్‌ఓ సత్యనారాయణ, నోడల్ అధికారులు, ఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే ఆటంకం!

- చదిపిరాళ్ల కుటుంబంలో ఏకాకిగా మిగిలిన ఆదినారాయణరెడ్డి
- ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసిన భూపేష్
- రానున్న ఎన్నికల్లో బరిలో ఉంటానని ప్రకటన
- మద్దతుగా నిలిచిన దేవగుడి సోదరులు
- ఆదికి ఇంటినుంచే చెక్



ఆదినారాయణరెడ్డి



భూపేష్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: జమ్మలమడుగు నియోజకవర్గంలోని చదిపిరాళ్ల కుటుంబంలో మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఏకాకి అయ్యారు. సోదరులు మూకుమ్మడిగా ఏకతాటిపైకి వచ్చారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వీరంతా పాల్గొన్నారు. బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి జిత్తులకు ఇంటి నుంచే బ్రేకులు పడ్డాయి. నాన్నలా సీటు వదులుకునే ప్రసక్తే లేదని భూపేష్ సైతం తేల్చి చెప్పారు. ఆరోజు పరిస్థితులు వేరు, ఈరోజు పరిస్థితులు వేరంటూనే ఎన్నికల్లో పోటీలో ఉంటానని బహిరంగంగా ప్రకటించారు.

టీడీపీ, బీజేపీ ఎన్నికల పొత్తులో భాగంగా జమ్మలమడుగు సీటు బీజేపీకి కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీకి సైతం వెళ్లి అధిష్టానం పెద్దలతో సంప్రదింపులు జరిపి, విజయవాడలో తిష్ట వేశారు. ఎలాగైనా సరే జమ్మలమడుగు సీటును బీజేపీ కోటాలో దక్కించుకోవాలని అనేక యుక్తులు ఇప్పటికీ ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పొత్తులో భాగంగా పోటీ నుంచి తప్పుకోవాల్సి వస్తుందేమోనన్న భావన టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి మదిలో పడింది. ఈ నేపథ్యంలో మంగళవారం జమ్మలమడుగు కేంద్రంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా అభిమానులను, అనుచరులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి దేవగుడి సోదరులు హాజరవుతారా.. లేదా అన్న సందేహం రాజకీయ పరిశీలకుల్లో ఉండింది. అయితే అందరి అనుమానాలను పటాపంచలు చేస్తూ ఆదినారాయణరెడ్డి మినహా మిగిలిన సోదరులంతా సమావేశానికి హాజరై ఆశ్చర్యపరిచారు.

ఆది స్పీడ్‌కు బ్రేకులు..

బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి స్పీడ్‌కు ఇంటి నుంచే బ్రేకులు పడుతున్నాయి. సోదరులు మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డిలతోపాటు రామాంజనేయరెడ్డి, జయరామిరెడ్డి, శివనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి సైతం భూపేష్‌రెడ్డి నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు బరిలో ఉంటానని ఆత్మీయ సమావేశంలో భూపేష్ స్పష్టం చేశారు. నాన్నలా పోటీ నుంచి విరమించే ప్రసక్తేలేదని తేల్చి చెప్పారు. టీడీపీ ఓటు బీజేపీకి బదలాయింపు కాదన్నారు. మీరంతా నా వెన్నంటే నడుస్తారని ఆశిస్తున్నా అంటూ.. బీజేపీకి సీటు కేటాయించినా సరే, ఎన్నికల్లో తాను పోటీలో ఉంటానని నర్మగర్భంగా తేల్చి చెప్పారు.

తిరగబడ్డ భూపేష్...

దేవగుడి కుటుంబంలో ఆదినారాయణరెడ్డిని నియంతగా పరిశీలకులు అభివర్ణిస్తారు. 2009 ఎన్నికల నుంచి తన రాజకీయ వారసుడు భూపేష్ అంటూ ప్రకటిస్తూ వచ్చిన ఆయన ఇటీవల టీడీపీకి కేటాయిస్తే భూపేష్, బీజేపీకి కేటాయిస్తే తాను పోటీలో ఉంటానని సన్నిహితులతో చెప్పుకొచ్చినట్లు సమాచారం. అవకాశవాదిగా ముద్రపడిన ఆది ఎత్తుగడలను పసిగట్టి ఆ మేరకే భూపేష్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు స్పష్టమవుతోంది. ఏదిఏమైనా భూపేష్ తన కుటుంబంలో పట్టు సాధించి ఆదికి రాజకీయ సవాల్ విసిరారనే చెప్పవచ్చు.

క్లుప్తంగా

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


కళ్యాణి (ఫైల్)

మదనపల్లె : కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువతి అదృశ్యం కావడంపై ఆమె తండ్రి శ్రీధర్‌రెడ్డి మంగళవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని సిటిఎం పంచాయతీ రేగడ గొల్లపల్లికి చెందిన శ్రీధర్‌రెడ్డి కుమార్తె కొప్పిరెడ్డి కళ్యాణి (24) తిరుపతి యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతోంది. ఇటీవల ఇంటికి వచ్చిన ఆమె సోమవారం ఉదయం కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయింది. దీంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం సాయంత్రం తన కుమార్తె అదృశ్యంపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.శేఖర్ ఆదేశాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మంగళవారం పట్టణంలో జరిగింది. బసినికొండ జన్మభూమి కాలనీకి చెందిన షఫీ అహ్మద్ (38) పట్టణంలో బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి బైక్‌పై వస్తుండగా పుంగనూరు రోడ్‌లోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద మరో ద్విచక్ర వాహనం అతన్ని ఢీకొంది. ప్రమాదంలో షఫీ అహ్మద్ తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పీలేరు రూరల్ : ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డ సంఘటన మంగళవారం మండలంలోని పొంతలచెరువు క్రాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో ఉంటున్న మదీనా డీజిల్ మెకానిక్ అధినేత ఎస్.ఎం.రఫీ (46), అప్సర్ (16) బొలెరో వాహనంలో కలకడకు బయలుదేరారు. కలకడకు చెందిన శరవణ కుమార్ (26) కారులో పీలేరుకు వస్తున్నాడు. మార్గంమధ్యలో పొంతలచెరువు క్రాస్ వద్ద ఈ వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వారి ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అపురూప ఘట్టం.. మహానైవేద్యం

- త్రినేత్ర ధారణతో వీరభద్రస్వామి దర్శనం
- మార్మోగిన శివనామస్మరణ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు


త్రినేత్రధారణలో వీరభద్రస్వామి


ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు


రాశిలోని ప్రసాదాన్ని తీసుకెళ్తున్న వడియరాజులు, భక్తులు


భక్తజన సందోహం మధ్య రథోత్సవం

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో అపురూప ఘట్టమైన మహానైవేదాన్ని వేదపండితులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళ్లారా చూసేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ప్రత్యేకత

స్వామి వారికి రోజూ నైవేద్యం సమర్పిస్తారు. ఏడాదికి ఒక రోజు మహానైవేద్యం సమర్పిస్తారు. పెద్ద మొత్తంలో ఒకే రాశిలో పోయడం వల్ల మహానైవేద్యం అంటారు. దీనికోసం స్వామికి రోజు వారి భత్యంలో భాగంగా ఒక సేరు బియ్యం చొప్పున 365 రోజులకుగాను 365 సేర్ల బియ్యంతో వండిన భోజనం, నెలకు ఒక సేరు బియ్యం ప్రకారం 12 నెలలకు 12 సేర్ల బియ్యంతో చేసిన అత్తిరసాలు (నిప్పట్లు), అనేక రకాల కూరగాయలతో వండిన వంటకాలతోపాటు పలు రకాల దుంపలు, గుమ్మడి కాయలు వండి రాశిగా పోస్తారు. ఆనవాయితీ ప్రకారం సుండుపల్లె మండలం శ్రీరామాపురానికి చెందిన వారు తడిబట్టలతో మడికట్టుతో తెల్లవారుజామున మూడు గంటల నుంచే ఈ వంటకాలను వండి సిద్ధం చేశారు. వాటిని రాశిగా పోసిన తరువాత వేదపండితులు ప్రణవానందగిరిస్వామి (నర్రా వెంకటభాస్కర్ సిద్ధాంతి) ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారు. అనంతరం భోజనం తీసుకొచ్చి ఆలయం మధ్యలో రాశిగా పోశారు. ప్రధాన అర్చకులు వేదపండితుల సాయంతో స్వామికి బంగారు కిరీట ధారణ చేసి, త్రినేత్రం (మూడవ కన్ను) ధరింపజేశారు. స్వామి వారి త్రినేత్రం అన్నం రాశిపై పడుతుందని, అప్పుడు ఒక్క క్షణం పాటు ప్రకంపనలు వస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఆ సమయంలో స్వామి వారికి ఎదురుగా ఎవరూ ఉండకుండా జాగ్రత్త వహిస్తారు. అనంతరం వీరశైవులు, కన్నడ భక్తులు సిద్ధాంతి నుంచి అనుమతి తీసుకుని కత్తులతో విన్యాసాలు చేస్తూ శివ.. శివ.. మహదేవ్ అంటూ హాహాకారాలు చేస్తూ కత్తులు దూసుకొంటూ రాశిని కొల్లగొట్టారు. తరువాత మట్లి వడియరాజులు రాశిలోకి దూసుకెళ్లి రెండు చేతులతో అందినంత దోచుకెళ్లారు. వడియ రాజులు కొల్లకొట్టి తీసుకెళ్లే ఆచారం తరతరాలుగా వస్తోంది. పూర్వం ఈ ఆలయాన్ని ముస్లిం రాజుల దాడి నుంచి కాపాడినందుకు గానూ హక్కును పొందినట్లుగా శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ మహోత్సవం నిర్వహణలో వేదపండితులు, రుత్వికుల మంత్రోచ్చారణలు, లింగాయత్తుల విన్యాసాలు, కన్నడ భక్తుల హరహర మహాదేవ్ అంటూ వినిపించే శబ్దాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది.

మాకు ఎంతో ప్రీతి

మహా నైవేద్యం కొల్లగొట్టిన తరువాత మిగిలిన నైవేద్యాన్ని (ప్రసాదాన్ని) కన్నడ భక్తులు తీసుకొచ్చి ఆలయం వెలుపల విస్తర్లలో ఎండపెట్టుకున్నారు. ఎండిన తరువాత వడియాలుగా మార్చుకొని తీసుకెళ్తారు. ఇళ్లలో ఉపవాసాలు ఉన్న రోజుల్లో వండిన ప్రసాదంలో కలుపుకొని తింటామని వారు చెప్పడం విశేషం.

రమణీయంగా రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగంగా రథోత్సవాన్ని రమణీయంగా నిర్వహించారు. శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగు రంగుల పూలతో రథంలో ఆశీనులను చేశారు. ఆలయ మాఢవీధులు, పట్టణ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

వందల కోట్లతో పనులు జరుగుతున్నా కనిపించలేదా?

- బీటెక్ రవి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నావు
- అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకే తాగి వాగుతున్నావు
- వైఎస్సార్‌సీపీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : పులివెందుల ప్రాంతంలో వందల కోట్ల రూపాయలతో రోజురోజుకు అభివృద్ధి జరుగుతుంటే బీటెక్ రవి మిడిమిడి జ్ఞానంతో జీర్ణించుకోలేక ఇష్టం వచ్చినట్లు తాగి వాగుతున్నాడని లింగాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వివేక్, భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం జగన్ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. పులివెందుల ప్రాంతం అభివృద్ధి చెందిందంటే అది అప్పట్లో ఆ మహానేత వైఎస్సార్, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల వల్లే అన్నారు. వైఎస్ కుటుంబం ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తుంది తప్ప, నీలాంటి డ్రామా ఆర్టిస్టులు, పేకాటరాయుని గురించి ఆలోచించే సమయం వారికుండదన్నారు. ఏదైనా మెడికల్ హాస్పిటల్ ప్రారంభమైన తర్వాత నాన్స్ ప్రకారం ఆసుపత్రికి సంబంధించిన బెడ్స్, ఇతరత్రా సౌకర్యాలను బట్టి కళాశాలలో సీట్ల కేటాయింపు, సిబ్బందిని నియమిస్తారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించింది వైఎస్సార్ జీజీహెచ్ ఆసుపత్రి అన్నారు. ఏమీ తెలియని పేకాటరాయుడు తన ఎల్లో మీడియా ఉంది కదా అని.. నాలుగు మైకులు ముందర పెట్టుకుని అవాకులు, చవాకులు మాట్లాడడం అవివేకమన్నారు. జలకళలో బోర్లు వేయడం అనేది రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక పథకమన్నారు. అలాంటి జలకళ పథకంలో బీటెక్ రవి స్వగ్రామం కసనూరులో 47 బోర్లు వేయడాన్ని కూడా ఆయన విమర్శించడం నీచమన్నారు. అంటే బీటెక్ రవికి తన స్వగ్రామంలోని రైతులు బాగుపడడం ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. బీటెక్ రవి నిజమైన నాయకుడైతే ఇలాంటి పథకాలను స్వాగతించాలి కానీ, విమర్శించడం అతని అవివేకానికి నిదర్శనమన్నారు. సుమారు వందల కోట్ల రూపాయలతో మెడికల్ కళాశాల పనులు జరుగుతున్నా నీకు కనిపించలేదంటే నువ్వు కళ్లున్న కబోదివి అని అర్థమౌతుందన్నారు. మెడికల్ కళాశాలకు పర్మిషన్ అనేది దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉంటుందన్నారు. అందులో భాగంగానే పులివెందులలో కూడా అదే పద్ధతిని అనుసరిస్తున్నారన్నారు. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు కళ్లముందే బోలేవార్డు, మినీ సెక్రటేరియేట్, షాపింగ్ కాంప్లెక్స్, వైఎస్సార్ పార్కులు, జనరల్ హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేసినా అసంపూర్తిగా పనులు జరుగుతున్నాయని అనడం నీ అవివేకానికి నిదర్శనమన్నారు. రాసి పెట్టుకో వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని, హడావిడిగా అసంపూర్తి భవనాలు ఎక్కడా ప్రారంభించలేదన్నారు. పనులు పూర్తి అయినందువల్లే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభోత్సవాలు చేశారన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాష్ట్ర వ్యాప్తంగా ఒక పద్ధతి ప్రకారమే మంజూరు చేస్తారన్న విషయం కూడా మీకు తెలియదా? అని ప్రశ్నించారు. గ్రావెల్ రోడ్ల పనులకు సంబంధించి నియమ నిబంధనలు దేశవ్యాప్తంగా ఒకే విధానంలో ఉంటాయన్నారు. మీ ప్రభుత్వ హయాంలో చేసిన నీరు–చెట్టు పనుల్లాగా దొంగ పనులు కావన్నారు. నీరు–చెట్టు దొంగ పనులకు అలవాటుపడ్డ మీరు ఎవరు చేసినా అలాగే చేస్తారన్న భ్రమలో బతుకుతున్నారన్నారు. వైఎస్సార్ జలకళ కింద ఇప్పటికే వందల సంఖ్యలో బోర్లు వేయడం జరిగిందన్నారు. రైతుల అవసరాలను బట్టి బోర్లు వేస్తారన్నారు. సింహాద్రిపురం మండలం కసనూరు గ్రామంలో రైతులకు బోర్లు అవసరం కాబట్టే బోర్లు మంజూరయ్యాయన్నారు. అవసరం లేదని నీకు చేతనైతే రైతులతో చెప్పించగలవా? అని వారన్నారు.

కుక్కల దాడిలో 10 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

రామాపురం : మండలంలోని సుద్దమళ్లపంచాయతీ తూపల్లెలో మంగళవారం తెల్లవారుజామున గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలైనట్లు యజమాని వెంకటరమణ తెలిపారు. భూమి ఉన్నప్పటికీ పంటలు సరిగ్గా సాగు రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పు చేసి గొర్రెలను పెంచుకుంటున్నానని, ఇంటి సమీపంలోని గొర్రెల మంద చుట్టూ కంచెను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రాత్రి సమయంలో అక్కడే ఉంటామని, కానీ మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో 10 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రామాపురం ఇన్‌చార్జి పశువైద్యాధికారి డాక్టర్ మహేష్ తన బృందంతో మృతి చెందిన గొర్రెలకు శవపరీక్ష నిర్వహించారు. గాయపడి గొర్రెలకు చికిత్స అందించారు. గొర్రెల యజమాని ఇన్సూరెన్స్ చేసుకొని ఉంటే ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చేవని తెలిపారు. గ్రామంలో పర్యటించి గొర్రెలకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతి ఒక్క గొర్రెల యజమాని పశు బీమా తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు.

ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు


ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని కాపాడి తీసుకొస్తున్న పోలీసులు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో రైల్వే పట్టాలపై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తి ప్రాణాలను సిద్దవటం పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం మధ్యాహ్నం భాకరాపేట రైల్వే పట్టాలపై ఎవరో వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు పడుకొని ఉన్నాడని 100 డయల్ నుంచి సిద్దవటం పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే స్పందించి హెడ్ కానిస్టేబుల్ శివప్రసాద్‌రెడ్డి, కానిస్టేబుల్ నాగరాజు భాకరాపేట రైల్వే పట్టాలపై పడుకుని ఉన్న వ్యక్తి వద్దకు వెళ్లారు. క్రిమి సంహారక మందు తాగి రైలు కింద పడి చనిపోయేందుకు ఉన్న అతన్ని వెంటనే కాపాడారు. అతన్ని విచారణ చేయగా.. తమది బద్వేల్, పేరు వెంకటసుబ్బయ్య, కుటుంబ కలహాల వల్ల చనిపోవడానికి ఇక్కడికి వచ్చానని చెప్పారు. వెంటనే అతని బంధువులకు సమాచారం ఇచ్చి 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

రాజంపేటలో వన్‌స్టేషన్, వన్ ప్రాడక్ట్ ప్రారంభం


రాజంపేట రైల్వేస్టేషన్‌లో వర్చువల్ విధానంలో ప్రారంభించిన వన్‌స్టేషన్, వన్‌ప్రొడక్ట్ సెంటర్

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్‌లో మంగళవారం వన్‌స్టేషన్, వన్‌ప్రొడక్ట్‌ను వర్చువల్ విధానంలో దేశ ప్రధాని మోదీ ప్రారంభించారు. స్టేషన్ నంబరు వన్ ప్లాట్‌ఫాంలో ప్రధాని మోదీ ప్రారంభోత్సవాన్ని వీక్షించేందుకు ప్రత్యేకంగా రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అక్కడ సందడి వాతవరణం నెలకొంది. వన్‌ప్రొడక్ట్ ద్వారా హ్యాండ్‌లూమ్‌తో బొమ్మలు, వస్తువుల విక్రయాలు జరుపుతారు. కార్యక్రమంలో రైల్వేశాఖ తరపున సీనియర్ డివిజనల్ ఇంజినీరు అభిరాం, కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్దన్, స్టేషన్ మేనేజరు సుధాకర్‌రాజు, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు చెంగల్‌రాజు, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ ఆలయంలో చోరీ

బి.కోడూరు : మండలంలోని రాజుపాలెం గ్రామ సమీపాన ఉన్న పడమటిఅంకాలమ్మ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అమ్మవారి కిరీటంతోపాటు కొన్ని వెండి వస్తువులు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని వారు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అప్పు తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించకుండా మోసం చేస్తున్నాడన్న మనస్తాపంతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లి మండలంలో జరిగింది. అంకిశెట్టిపల్లెకు చెందిన మహేష్‌రెడ్డి పట్టణంలోని సొసైటీ కాలనీలో ప్రైవేట్ హాస్పిటల్ నిర్వహిస్తూ డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య లాస్య(30), ఇద్దరు పిల్లలు ఉన్నారు. లాస్య తనకు స్నేహితుడు, నెల్లూరులో నివాసం ఉంటున్న నరేంద్రకు విడతల వారీగా రూ.5 లక్షల నగదు భర్తకు తెలియకుండా అప్పుగా ఇచ్చింది. గత జనవరి నెలలోగా అప్పు తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చిన నరేంద్ర, ప్రస్తుతం చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తుండడంతో, మనస్తాపం చెందిన లాస్య మంగళవారం ఇంటి వద్ద క్రిమి సంహారణ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

కుటుంబ సమస్యలతో...

కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. సర్కారు తోపులో నివాసం ఉంటున్న మహబూబ్ భార్య ఎస్.ఖాసీంబి(47) కుటుంబ సమస్యల కారణంగా ఇంటి వద్ద యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయా ఘటనల్లో సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


మద్యం తరలిస్తున్న నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ పోలీసులు

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ, డీటీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడిని అరెస్ట్ చేసి, కారు సీజ్ చేసినట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బడికాయలపల్లె చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. మదనపల్లె మండలం ఈశ్వరమ్మకాలనీకి చెందిన ఏ.రామన్న కుమారుడు ఏ.వెంకటనారాయణ(50) కారులో కర్ణాటక మద్యం 96 బాటిళ్లు తరలిస్తుండగా, పట్టుకుని కేసు నమోదు చేసి, కారు సీజ్ చేశామన్నారు. అలాగే మండలంలోని నారమాకులపల్లె తండా సమీపంలోని అటవీప్రాంతంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1,950 లీటర్ల నాటుసారా ఊటను గుర్తించి, ధ్వంసం చేసి కేసు నమోదు చేశామన్నారు. బెల్లం ఊటను సిద్ధం చేసుకున్న వ్యక్తుల గురించి విచారణ చేస్తున్నామని, నిందితులపై కేసు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో తాలూకా సీఐ ఎన్.శేఖర్, స్పెషల్ పార్టీ సహకరించినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు.. వ్యక్తికి తీవ్ర గాయాలు

బి.కోడూరు : మండల పరిధి ఎం.నరసింహ్మాపురం గ్రామ సమీపంలోని రోడ్డుపై మంగళవారం రాత్రి బైక్‌ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో మేకవారిపల్లె గ్రామానికి చెందిన పందీటి సుబ్బనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. సుబ్బనారాయణ తన దినచర్యలో భాగంగా ప్రతిరోజు బద్వేలులోని సెలూన్ షాపునకు వెళ్లి పని చేసి సాయంత్రానికి తిరిగి స్వగ్రామానికి వచ్చేశాడు. ఈ క్రమంలో మంగళవారం కూడా తన పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై బద్వేలు నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఎం.నరసింహ్మాపురం గ్రామ సమీపాన వెనుక నుంచి వస్తున్న బద్వేలు ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బంధువులు 108 వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

వ్యక్తి దారుణ హత్య

నిద్రిస్తున్న వ్యక్తిపై బండ రాళ్లతో మోది చంపిన వైనం


హత్యకు గురైన రాజారెడ్డి


ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ములకలచెరువు : కోళ్ల ఫారంలో నిద్రిస్తున్న రాజారెడ్డి (55) అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు బండ రాళ్లతో మోది దారుణంగా చంపిన సంఘటన మంగళవారం వేకువ జామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సెంట్రల్ స్కూల్ పంచాయతీ పద్ద మొరవపల్లికి చెందిన రాజారెడ్డి తన సొంత పొలంలో కోళ్ల ఫారం షెడ్డు వేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఒంటి గంట వరకు ఫారంలోని కోళ్లను ఓ వాహనంలోకి ఎక్కించి మార్కెట్‌కు పంపించారు. ఆ సమయంలో రాజారెడ్డితో పాటు కుమార్తె బ్రహ్మణి, అల్లుడు బాలాజీ కూడా అక్కడే ఉన్నారు. అనంతరం కుమార్తె కడుపు నొప్పిగా ఉందని చెప్పడంతో ఆమెతోపాటు అల్లుడు సమీపంలోనే ఉన్న మొరవపల్లిలోని ఇంటికి వచ్చి మందులు తీసుకుని తిరిగి కోళ్ల ఫారం చేరుకున్నారు. అప్పటికే రాజారెడ్డి రక్తపు మడుగులో శవమై ఉండటం చూసిన కుమార్తె, అల్లుడు పక్కనే ఉన్న మరో కోళ్ల ఫారం నిర్వాహకుడు నాగభూషణంకు ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు. ఈ హత్య విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐ తిప్పేస్వామి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాలను క్షుణంగా పరిశీలించారు. వేలి ముద్ర నిపుణులు నమూనాలు సేకరించారు. పోలీసు జాగిలాలు సమీపంలో ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు వెళ్లగా పోలీసులు పలు కోణాల్లో సమగ్రంగా విచారణ చేపట్టారు. అనంతరం మదనపల్లి డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి విలేకరుల సమావేశం నిర్వహించారు. మృతుడి అల్లుడు బాలాజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ హత్య కేసును మూడు రోజుల్లో ఛేదించి హత్యకు పాల్పడిన నిందితులను అరెస్టు చేస్తామని డీఎస్పీ వెల్లడించారు. అయితే ఈ హత్యకు కారణం ఆస్తి తగాదాలా, వివాహేతర సంబంధాలా, వేరే ఇతర కారణాలా అనేది పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.

వైభవంగా గంగమ్మ జాతర

- ఘనంగా అమ్మవారి కల్యాణం
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు


అమ్మవారి కల్యాణంలో పాల్గొన్న భక్తజనం


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చింతకొమ్మదిన్నె : మండల పరిధి కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలో రెండు రోజుల పాటు జరిగిన గంగమ్మ జాతర ముగిసింది. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి చింతకొమ్మదిన్నెలోని ఆలయ చైర్మన్ బుసిరెడ్డి పార్వతమ్మ గారి విశ్వనాథరెడ్డి ఇంటి నుంచి సాంగ్యాన్ని మేళతాళాలు, బాణ సంచాల మధ్య ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం కల్యాణంలో ఏర్పాటు చేసిన లడ్డూకు వేలం పాట నిర్వహించారు. భక్తులకు ఆలయ అధికారులు ముత్యాల తలంబ్రాలను పంచిపెట్టారు. రెండవ రోజు మైల తిరునాల కావడంతో మండలంలోని భక్తులే కాకుండా జిల్లా, రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ కుమార్‌రెడ్డి తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణ సమీపంలో బాలికలు, యువతుల కోలాటం భక్తులను అకట్టుకుంది. భక్తుల సౌకర్యార్థం దాతలు మజ్జిగ, పానకం, వాటర్ ప్యాకెట్లు, ప్రసాదాలు అందించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శంకర్ నాయక్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.